జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 24-6-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 377 పేజీలు: 4 వెల : రూ.7



# ఎస్పీ.. ది గ్రేట్

* జిల్లాలో పారదర్శకంగా కానిస్టేబుల్స్, హెచ్‌సీలు, ఏఎస్‌ఐల బదిలీ
* పోలీసులతో ముఖాముఖి మాట్లాడి ట్రాన్స్‌ఫర్ చేసిన ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి
* సిఫార్సులకు చెక్ చెప్పిన ఐపీఎస్ అధికారి
* ఆరోపణలు ఉన్న వారికి బదిలీ
* అన్ని పీఎస్‌లలో సిబ్బంది కొరత లేకుండా భర్తీ
* జిల్లా పోలీసు కార్యాలయం, పీఎస్‌లో పాతుకుపోయిన వారికి ట్రాన్స్‌ఫర్
* పక్కా ప్రణాళికతో జాబితా తయారీ
* బదిలీలు అంతా జిల్లా పోలీస్ బాస్ కనుసన్నల్లోనే
* కొందరిలో ఖేదం.. మరికొందరిలో మోదం

**శ్రీకాకుళం క్రైం, జూన్ 23 (వార్త):** జిల్లా పోలీసు శాఖలోని కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ స్థాయి వరకూ పనిచేస్తున్న సిబ్బందికి భారీగా బదిలీలు అయ్యాయి. తాను ఏదైతే అనుకున్నారో.. అదే చేశారు.. బదిలీ కాకుండా ఉండేందుకు కొందరు సిఫార్సు లేఖలు తేగా, వాటిని పక్కన పడేశారు.. ఆరోపణలు ఉన్న వారికి సుదూర స్టేషన్లకు ట్రాన్స్‌ఫర్ చేశారు.. యువ ఐపీఎస్ అధికారి, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి. ఎవరెవరు ఎక్కడ పనిచేస్తున్నారు.. ఎన్నేళ్ల నుంచి ఏ విధంగా పనిచేస్తున్నారు.. వారిపై ఆరోపణలు ఉన్నాయా.. అక్రమాలకు పాల్పడ్డారా.. ఇలా పలు అంశాలతో క్షుణ్ణంగా నివేదికను తెప్పించుకుని మరీ బదిలీలు చేశారు. పోలీసులను కౌన్సెలింగ్‌కు పిలిచి వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకుని వారికి ఆయా ప్రాంతాలకు ట్రాన్స్‌ఫర్ చేశారు. బాగా పనిచేసిన వారికి వారు కోరుకున్నచోటకు బదిలీ చేసినట్టు తెలిసింది. సిఫార్సులను పక్కన పెట్టేసి పారదర్శకంగా బదిలీ ప్రక్రియ నిర్వహించారు. 18 మంది ఏఎస్ఐలకు, 63 మంది హెడ్‌కానిస్టేబుళ్లకు, 139 మంది కానిస్టేబుళ్లకు స్థానచలనం చేశారు. ఒక సబ్ డివిజన్ నుంచి మరో సబ్‌డివిజన్‌కు బదిలీ చేశారు. బదిలీ జాబితాను పక్కా ప్రణాళికతో ఎస్పీ రూపొందించినట్టు తెలిసింది. జిల్లాలో చాలావరకూ పీఎస్‌లలో కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటన్నింటినీ భర్తీ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పాస్‌పోర్టు, తదితర పేర్లు చెప్పుకుని ఎన్నో ఏళ్లుగా పాతుకుపోయిన వారిని, ఆయా పీఎస్‌లలో అక్రమాలకు పాల్పడిన వారిని జిల్లా శివారు ప్రాంతాల్లోని పీఎస్‌లకు బదిలీ చేశారు. బదిలీ అయిన వారిని తక్షణం రిలీవ్ చేయాలని సంబంధిత పోలీస్‌స్టేషన్ల హౌస్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బదిలీ అయిన వారు ఆయా స్థానాల్లో చేరిన సమాచారాన్ని జిల్లా పోలీసు కార్యాలయానికి అందజేయాలని ఎస్పీ సూచించినట్టు తెలిసింది. బదిలీ అయిన వారిలో కొందరు తమకు న్యాయం జరిగిందని ఆనందంలో మునగగా, మరికొందరు ఆవేదన వ్యక్తం చేశారు. ఏదేమైనా పోలీసుల బదిలీలు కొంతవరకూ జాప్యమైనా.. బదిలీలు పారదర్శకంగా జరగడం పట్ల ఆ శాఖలోని పోలీసు సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎస్పీ.. ది గ్రేట్ అంటూ కొనియాడుతున్నారు.

* నరసన్నపేట నుంచి 300 బైక్ లతో శ్రీకాకుళం వరకు ర్యాలీ * నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తావో చెప్పు చంద్రబాబు అంటూ నినాదాలు * ప్లకార్డులతో జిల్లా కేంద్రంలో ప్రదర్శన * జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తో పాటు హాజరైన అన్ని నియోజకవర్గాల సమన్వయకర్తలు




# పోరుకు.. పోటెత్తిన యువత

శ్రీకాకుళం, జూన్ 23(వార్త): వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ కూటమి సర్కారుపై నిరసన గళం తెలిపే యువత పోరు కార్యక్రమం జిల్లాలో విజయవంతమైంది. అన్ని నియోజకవర్గాల నుంచి అధిక సంఖ్యలో యువత స్వచ్ఛందంగా జిల్లా కేంద్రానికి సోమవారం చేరుకుని యువత పోరు నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. చంద్రబాబు నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తావ్... లక్షల ఉద్యోగాలు ఎప్పుడు అంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు పట్టుకుని నిరసన ర్యాలీలో గళం విప్పారు. జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణ దాస్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి అన్ని నియోజకవర్గాల సమన్వయకర్తలు, యువజన విభాగం అధ్యక్షులు, యువత పాల్గొన్నారు. ఇదిలా ఉండగా నరసన్నపేట నియోజకవర్గం నుండి సుమారు 300 బైకులతో యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీతో శ్రీకాకుళం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన ఉప అధ్యక్షులు మెంటాడ స్వరూప్, జిల్లా యువజన అధ్యక్షుడు మార్పు పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



## బలగ ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాకుళం, జూన్ 23(వార్త):** బలగ ప్రభుత్వ డిఎల్టిసి ఐటిఐకు రెండో విడతలో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జులై నెల 21న ఉదయం 9 గంటలకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ వై.రామ్మోహన్రావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఉదయం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కంప్యూటర్ కోర్స్, ఫిట్టర్, మోటార్ మెకానికల్, డీ.ఎం సివిల్, ఎలక్ట్రిషియన్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. జులై 15లోగా ఆన్‌లైన్ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. జులై 17న వేరిఫికేషన్ ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరూ అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఆ రోజు బలగలోని తమ ఐటిఐ కార్యాలయానికి హాజరుకావాలన్నారు.



# అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

**-106 వినతుల స్వీకరణ**

**-జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు**

**శ్రీకాకుళం, జూన్ 23(వార్త):** అర్జీలు సత్వరమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికలో ఆయన అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, డ్వామా, మహిళా శిశు సంక్షేమం, మున్సిపల్ కార్పొరే షన్, జిల్లా పంచాయతీ, ఎపిఈపీడిసియల్, సర్వే, భూగర్భ గనులు, ఇరిగేషన్, తదితర శాఖల సమ స్యలపై 106 అర్జీలు స్వీకరించారు. డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ వేణుగోపాల్, డిఆర్డిఎ పిడి కిరణ్ కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు ఆయా శాఖల వద్ద పెండింగ్ లో అర్జీలపై సమీక్షించారు. అర్జీలు సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.



## ఒకేసారి 39 కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**ఆమదాలవలస, జూన్ 23(వార్త):** గత వైసీపీ ప్రభుత్వంలో ఐదు సంవత్సరాల వ్యవధిలో ఆమదాలవలస నియోజవర్గం లో కనీసం10 లక్షల రూపాయలు కూడా సీఎంఆర్ఎఫ్ విభాగం నుండి నిస్సహాయత కుటుంబాలు ఇవ్వలేదు గత పాలకులు అయితే కూటమి ప్రభుత్వం వచ్చినా ఏడాది లోనే కోటి 30 లక్షలు రూపాయల దాటి సీఎంఆర్ఎఫ్ విభాగం నుంచి నిధులు తెచ్చి బాధిత కుటుంబాలకు చెక్కులు అందించిన గొప్ప నాయకుడు కూన రవికుమార్ అని టీడీపీ నేతలు కొనియాడారు. ఆమదాలవలస నియోజకవర్గం సరుబుజ్జిలి మండలంలోని డకరవలస గ్రామానికి చెందిన కరణం నంద కిషోర్ కుటుంబానికి 2,40,000 రూపాయలు, కొత్తకోట గ్రామానికి చెందిన సోల జ్యోతి కుటుంబానికి 36,000 రూపాయలు,రొట్టవలస గ్రామానికి చెందిన గుజ్జల సింహాచలం కుటుంబానికి 51,000 రూపాయలు మరియు బెవర రామారావు కుటుంబానికి 57,000 రూపాయలు, షలాంత్రి గ్రామానికి చెందిన యార్లంకి పద్మావతి కుటుంబానికి 95,000 రూపాయలు, సింధూవాడ గ్రామానికి చెందిన జనపల వెంకన్న కుటుంబానికి 59,000 రూపాయలు, తెలికిపెంట గ్రామానికి చెందిన వొన్న నరసింగరావు కుటుంబానికి 59,000 రూపాయలు, ఏఎల్ నగరం గ్రామానికి చెందిన బిర్లంగి భాస్కర రావు కుటుంబానికి 1,08,000 రూపాయలు సీఎంఆర్ఎఫ్ విభాగం నుంచి లబ్ధిదారులు కుటుంబానికి పొందూరు మాజీ ఎంపీపీ కూన ప్రమీలమ్మ అందజేశారు.

కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యం, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నందివాడ గోవిందరావు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు అంబాల రాంబాబు, రొట్ట వలస గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యుడు తాడెల రమణ పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులు చట్ట పరిధిలో పరిష్కరించాలి

**-అదనపు ఎస్పీ కెవి రమణ.**

**-58 వినతుల స్వీకరణ**

**శ్రీకాకుళం, జూన్ 23(వార్త):** ప్రజా పిర్యాదులు చట్ట పరిధిలో పరిష్కారం చూపాలి అని, ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార వేదిక కార్యక్రమంలో (పిజిఆర్ఎస్) స్వీకరించే పిర్యాదులు పరిష్కారానికి శ్రద్ద వహించి ఆయా ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి, త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీస్ అధికారులను అదనపు ఎస్పీ కె.వి. రమణ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమంలో అదనపు ఎస్పీ 58 మంది నుంచి వినతలు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి,ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదు దారుల అర్జీలు,వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు తక్షణమే జూమ్



కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీసు అధికారులకు తెలియ పరిచి చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని అదేశించారు.వృద్దులు, వికలాంగుల అర్జీదారులు వద్దకు స్వయంగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఆయా ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా,తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని అధికారులను ఆదేశించారు.

# దేశ నిర్మాణంలో యువత బలమైన శక్తి



**పలాస, జూన్ 23(వార్త):** యువత దేశ నిర్మాణంలో ఒక బలమైన శక్తిని పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి అన్నారు. సోమవారం పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నశా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సమావేశానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి అధ్యక్షత వహించారు. కార్యక్రమం ప్రారంభంలో విద్యార్థులు ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ“యువత దేశ నిర్మాణంలో ఒక బలమైన శక్తిని, యువతరంలో మాదకద్రవ్యాల వాడకం దేశ భవిష్యత్తుకు ముప్పుగా మారుతోందని తెలిపారు. ఇది వ్యక్తి మాత్రమే కాకుండా, కుటుంబం, సమాజం పైనా తీవ్ర ప్రభావం చూపిస్తుందని అన్నారు. భారతదేశాన్ని డ్రగ్స్ రహిత దేశముగా మార్చేందుకు యువత ముందుకు రావాలని తెలిపారు. ప్రతీ యువకుడు, యువతి బాధ్యతగా వ్యవహరించి మాదకద్రవ్యాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వైస్ ప్రిన్సిపల్ ఎల్. గణపతి రావు, ఐ క్యూ ఏసి కోఆర్డినేటర్ పి. వెంకటరమణ, బోధన మరియు బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

**మెళియాపుట్టి, జూన్ 23(వార్త):** మెళియాపుట్టి మండలం రేగులపాడు ఆఫ్ షోర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శ్రీకాకుళంలోని పాత బస్టాండ్ జంక్షన్ నుంచి జిల్లా పరిషత్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది.

## ఘనంగా మహా లింగార్చన



**శ్రీకాకుళం, జూన్ 23(వార్త):** ప్రత్యక్ష దైవం, ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామి వారి అనివెట్టి మండపంలో సోమవారం ఉదయం ఆలయ అర్చకులు, వేద పండితులు శివ పంచాయతన సహిత మహాలింగార్చన నిర్వహించారు. అనంతరం ఆలయంలో స్వామివారికి ఆలయ అర్చకులు, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, ఆలయ ఈవో ప్రసాద్ ఈ కార్యక్రమం నిర్వహించారు

## రైతులతో ‘వంశధార’ కమిటీ సమావేశం



**మందస, జూన్ 23(వార్త):** మందస మండలంలోని హరిపురంలో రైతులతో వంశధార సాగునీరు సాధన కమిటీ సమావేశం జరిగింది. బైరిశెట్టి గున్నయ్య మాట్లాడుతూ వంశధార జలాలు సాధన కోసం వంశధార సాగునీరు సాధన కమిటీతో కలిసి పని చేస్తామన్నారు. గ్రామ రైతాంగంపై పిలుపునకు కలిసి పని చేస్తామని చెప్పారు. అధ్యక్షుడు మార్పు మన్మధరావు, ఉపాధ్యక్షుడు ధర్మార్పు వెంకట్రావు, నల్ల హడ్డి, కొర్ల హేమరావుచౌదరి, వాయలపల్లి మాధవరావు, దుంపల వైకుంఠరావు, ఉగ్రపిల్లి సోమనాథం, కొర్నాన గంగాధర్, గున్న మోహనరావు, గున్న మురళి, దేవాడ నారాయణ, కొవ్వూరు దశరధి, వాయిలపల్లి పాపారావు, నర్సింగ్ నాథ్ సాబతో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సుపరిపాలనలో తొలి అడుగు విజయవంతం

**-ఎమ్మెల్యే గౌతు శిరీష**

**పలాస, జూన్ 23(వార్త):** సుపరిపాలనలో తొలి అడుగు విజయవంతం అయిందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. సోమవారం విజయవాడలో జరుగుతున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న పలాస ఎమ్మెల్యే మాట్లాడుతూ తొలి అడుగు పూర్తిగా విజయవంతమైందని చెప్పారు. అనంతరం విజయవాడ కనకదుర్గ అమ్మవారిని ఆమె దర్శించుకున్నారు. ఆమె వెంట ఏపీటీపీసీ ఛైర్మెన్ వజ్జ బాబూరావు, జనసేన నాయకులు మజ్జి భాస్కర్, కంచరన అనిల్, అధికారులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## గురుకుల పరీక్ష సమయాల మార్పు

**శ్రీకాకుళం, జూన్ 23(వార్త):** జిల్లాలోని అంబేద్కర్ గురుకుల విద్యాలయాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 6, 7, 8, 9వ తరగతిలో మిగిలియున్న సీట్ల అడ్మిషన్ కోసం దరఖాస్తు స్వీకరణ ప్రక్రియ ఇప్పటికే 8 పాఠశాలలో జూన్ 19 నుండి జరుగుచున్నట్లు గురుకులాల జిల్లా సమన్వయకర్త గుంపుల గ్రేస్ సోమవారం వెల్లడించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థిని/విద్యార్థులకు జిల్లా వ్యాప్తంగా బాలురుకు దుప్పలవలస, బాలికలకు ఎచ్చెర్లలో, జూన్ 25న బుధవారం నాడు 6, 7వ తరగతులకు ఉదయం 10 గంటల నుంచి 11.00 గంటల వరకు, అదే రోజు మధ్యాహ్నం 8, 9వ తరగతులకు విద్యార్థిని/విద్యార్థులకు 2.00 గంటల నుంచి 3.00 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని వివరించారు. కావు విద్యార్థిని/విద్యార్థులు పరీక్ష సమయాల మార్పును గమనించగలరని తెలియజేస్తూ, దరఖాస్తు చేసుకొనుటకు గడువు మరో రెండు రోజులు ఉన్నందున వెనుకబడిన వర్గాల విద్యార్థిని/విద్యార్థులకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఇతర వివరములకు 9701736862/9000314209 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారము పొందాలని ఆమె సూచించారు.



## ఆదాని ఉద్యోగుల స్వచ్ఛంద రక్తదాన శిబిరం

**శ్రీకాకుళం, జూన్ 23(వార్త):** ఆదాని గ్రూప్ అధినేత గౌతమ్ అదాని జన్మదినం సందర్భంగా శ్రీకాకుళం జిల్లా స్మార్ట్ మీటరింగ్ సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదాన కార్యక్రమం చేపట్టారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా బ్లడ్ సెంటర్‌లో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ హెడ్ జై ప్రకాష్, డివిజనల్ హెడ్ మనోహర్ మాట్లాడుతూ, "సేవా కార్యక్రమాల్లో ఆదాని గ్రూప్ ఎల్లప్పుడూ ముందుంటుంది. రక్తదానం ద్వారా అవసరమైన వారికి ప్రాణాధారంగా నిలవాలన్నదే మా లక్ష్యం" అని అన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి. జగన్మోహనరావు మాట్లాడుతూ, తలసీమియా పిల్లల వంటి రోగులకు రక్తం అత్యవసరం. ఇలాంటి సందర్భాల్లో ఆదాని సిబ్బంది ముందుకు రావడం అభినందనీయం" అన్నారు. రక్తదానం చేసిన దాతలకు గోల్డ్ ప్లేటెడ్ మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కే. సత్యనారాయణ, బి. సతీష్ కుమార్, పీ. చైతన్య కుమార్, జి. రమణ తదితర ఆదాని గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

## టిడ్కో ఇండ్లు మంజూరు చేయండి



**పలాస, జూన్ 23(వార్త):** టిడ్కో ఇండ్లు మంజూరు చేయాలని పలువురు నుంచి దరఖాస్తు వచ్చాయని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. సోమవారం పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్)కార్యక్రమం లో టిడ్కో ఇండ్ల మంజూరు, డెత్ సర్టిఫికెట్, 27వ వార్డు లో సిమెంట్ రోడ్డు, మంచినీటి పైప్ లైన్ వంటి పలు సమస్యలపై మొత్తం 10 దరఖాస్తులు,అందులో టిడ్కో ఇండ్ల మంజూరు కొరకు -1, డెత్ సర్టిఫికెట్లు కొరకు-05, పెన్షన్ లు కొరకు-2, సిమెంటు రోడ్డు కొరకు-1మరియు మంచినీటి పైప్లైన్ కొరకు-1 దరఖాస్తు అందినవని కమిషనర్ సోమవారం వెల్లడించారు. టిడ్కో ఇండ్ల కొరకు ఉన్న సమస్యలు పై ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఈ విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, ప్రభుత్వం నుండి తగిన మార్గ దర్శకాలు వచ్చిన వెంటనే టిడ్కో ఇండ్ల దరఖాస్తులు పరిష్క రించడం జరుగుతుంది అని మున్సిపల్ కమిషనర్ తెలియజేసారు.

## డయేరియా రహిత సమాజాన్ని స్థాపించాలి

**-జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు**

**శ్రీకాకుళం, జూన్ 23(వార్త):** డయేరియా రహిత సమాజాన్ని సాధించుటకు కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికలో స్టాప్ డయేరియా గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16 నుం జూలై 31వరకు ఇంప్లిమెంటేషన్ పేజ్-2లో భాగంగా డయేరియా నివారణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. అనిత మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు. ముఖ్యంగా ఐదు ఏళ్లలోపు చిన్నారులలో అతిసారవ్యాధి ప్రబలకుండా, తగుజాగ్రత్తలు తీసుకోవాలని, ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబ్లెట్స్ను ప్రతీ ఇంటికి పంపిణీ చేసినట్లు వివరించారు. పంచాయితీరాజ్ శాఖ సమన్వయంతో నీటి నాణ్యత పరీక్షలు చేయుట, ట్యాంకుల శుభ్రత, క్లోరినేషన్ చేపట్టడమైనదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఇమ్యునైజేషన్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలక్టర్ డి.పద్మావతి, డిఆర్డిఎ పిడి కిరణ్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ వేణుగోపాల్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.రామ్సే పాల్గొన్నారు.



## చౌదరి కుటుంబానికి చెందిన..

# స్మశాన స్థలం కబ్జా

**పలాస, జూన్ 23 (వార్త):** భూములు ఎలాంటివైనా సరే.. కబ్జా దారులు కన్ను పడితే చాలు.. ఆక్రమణకు గురికావాల్సిందే.. ఇటువంటి ఘటనే పలాస మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కంబిరిగాం చౌదరి అంటేనే అత్యంత పేరు ప్రఖ్యాతులు గాంచిన కుటుంబమని గుర్తింపు ఉంది. వారి భూములు సాగుచేసుకుంటూ వందలాది మంది రైతులు జీవనోపాధి పొందుతున్నారు. పలాస మండలంలోని కేదార్పురం పంచాయతీ కంబిరిగాం గ్రామానికి చెందిన దువ్వాడ వెంకటరామ్ చౌదరికి సర్వే నెంబర్ 33 /1లో 12 ఎకరాల 73 సెంట్లు విస్తీర్ణం గల మామిడి తోట అందులో ఉంది. అందులో 23 సెంట్లు స్మశాన వాటికకు కేటాయించుకుని మిగిలిన 12 50 సెంట్లకు గాను గ్రామస్తులకు ఐదు ఎకరాలు, కోరాడ శ్రీనివాస్ కు రెండు ఎకరములు విక్రయించి పలాస సబ్ రిజిస్టర్ ఆఫీస్‌లో చౌదరి రిజిస్ట్రేషన్ చేశారు. మిగిలిన 5 ఎకరముల 50 సెంట్లు పెంట ఉదయ్ శంకర్‌కు అగ్రిమెంట్ చేశారు. మరల పెంట ఉదయ శంకర్, భూమిగల రైతు ఇరువురి సమ్మతితో కోరాడ శ్రీనివాస్‌కే విక్రయించారు. ఆదివారం రాత్రి స్మశానంలోని సమాధులు జెసిబి తో గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి వేళ కూలదోశారు. ఇంతలో గ్రామస్తులు మేల్కొని సంఘటన స్థలానికి చేరుకున్న సరికి అక్కడినుండి జెసిబితో ఉడాయించారు గ్రామస్తులు 100 నెంబర్‌కి ఫోన్ ద్వారా సమాచారం అందించారు.





కాశీబుగ్గ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొనే సరికి అక్కడ ఎవరూ లేకపోవడంతో గ్రామస్తులతో మాట్లాడి వెనుదిరిగి వచ్చేసారు. ఈ తతంగమంతా స్థలాన్ని కొనుగోలు చేసిన సదరు అసామీలు కబ్జాకు పాల్పడి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సోమవారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. స్థానిక సర్పంచ్ బోడసింగి ధనుంజయ, బమ్మిడి శివకుమార్ విలేకరులతో మాట్లాడుతూ ఈ స్మశాన వాటిక స్థలం మా పూర్వీకుల నుంచి చౌదరి కుటుంబానికి చెందిన వ్యక్తులు ఎవరు చనిపోయిన ఈ స్థలములోనే అంత్యక్రియలు నిర్వహించి వారి జ్ఞాపకార్థంగా సమాధులు నిర్మించేవారన్నారు. ఆ ఆనవాయితే నేటికీ కొనసాగుతుందని తెలిపారు. స్మశాన స్థలాన్ని కబ్జా చేయడం ఏమిటని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమాధుల తవ్వి పక్కనే ఉన్న గెడ్డలో పడేయడం దారుణమన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు వారితోపాటు హనుమంతు జనార్ధన, పాడి దుర్యోధన, అగరు అశోక్ కుమార్, బెవర చంద్రయ్య, సిపాయి చిరంజీవి, ఆగరు రాజారావు, పాడిదాసుతో పాటు గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

## ఆదివాసీ గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

**-వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు**

**మందస, జూన్ 23(వార్త):** జన జాతీయ గౌరవ వర్ష కార్యక్రమం ద్వారా ఆదివాసీ గ్రామాల అభివృద్ధే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధ్యేయమని వెలుగు ఐటిడిఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. బొగాబంద పంచాయతీలో డబార్సింగి రెవిన్యూలో గల కుమ్మర కుటియా గ్రామంలో ఉప సర్పంచ్ రాజు అధ్యక్షతన డిప్యూటీ ఎంపీడీవో వరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన జన జాతీయ గౌరవ వర్ష్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను సక్రమముగా అవగాహన చేసుకొని దీర్ఘకాలిక ప్రయోజనాలు దృష్ట్యా సక్రమంగా వినియోగించుకుని పేదరికం లేని గిరిజన సమాజము కోసం గ్రామాలలో ఐకమత్యంతో అభివృద్ధి చేసుకోవాలని కోరారు. దర్తీ ఆబ జన్ భగీదరి అభియాన్ ద్వారా గిరిజన గ్రామాలలో అన్ని రకాల



మౌలిక వసతులను కల్పించేందుకే సర్వే జరిపించినట్లు వివరించారు. ఆదివాసీ గ్రామాలకు మౌళిక వసతులు ఆయన విద్యుత్, ట్రాన్స్ పోర్ట్ సౌకర్యం కోసం ప్రభుత్వం రోడ్లు, పాఠశాలలు పూర్తి చేస్తోందని, విద్యార్థులు చక్కగా చదువుకోవడానికి మెరుగైన వసతులు, సేవలు అందిస్తున్నట్లు వివరించారు. గిరిజన గ్రామాలలో ప్రతీ కుటుంబం కూడా ఆరోగ్యంతో పాటు ఆనందంగా జీవించడానికి రక్షిత మంచినీరు, విద్య, వైద్యం, న్యూట్రిషన్ ఫుడ్, శానిటేషన్ తదితర అన్ని రకాల అవసరాలపై అందరికీ అవగాహన ఉండాలని వివరించారు. ఉపాధి, ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు మెరుగుపరుచుకోవడానికి స్వయంశక్తి సంఘాలలో పంచ సూత్రాలు పాటిస్తున్న సభ్యులందరికీ అవసరమైన పరపతి సౌకర్యాన్ని ఉన్నతి, శ్రీనిధి, తదితర బ్యాంకుల ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్నట్లు వివరించారు.

కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఎస్.చిన్నారావు, వ్యవసాయ విస్తరణ అధికారి జ్యోత్స్న, వెలుగు, ఉపాధి హామీ, ఐసీడీఎస్, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది మహిళా సంఘాల ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

**-ఈ నెల 26 నుంచి పనులు నిలుపుదల చేయనున్నమున్సిపల్ కార్మికులు**

**-సమ్మె నోటీస్ ఇచ్చిన మునిసిపల్ కార్మికులు**

**పలాస, జూన్ 23(వార్త):** పెండింగ్ లో ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం కానందున ఈ నెల 26 నుంచి పనులు బంద్ చేస్తున్నట్లు మున్సిపల్ శానిటేషన్ కార్మికులు మున్సిపల్ కమిషనర్ కు సమ్మెనోటీసు ఇచ్చారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ అనుబంధం జనరల్ బాడీ సమావేశం సి హెచ్ మురగన్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశం లో యూనియన్ జిల్లా కార్యదర్శి యన్ బలరామ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి యన్ గణపతి ముఖ్య అతిథిలుగా హాజరై మాట్లాడుతూ 2011-12 సంవత్సరాల పి యఫ్ డబ్బులు కార్మికుల ఖాతాలలో జమ చేయకుండా జాప్యం చేస్తూనే ఉన్నారని విమర్శించారు. పని చేసేందుకు పని ముట్లు కూడా ఇవ్వకుండా పని చేయమనడం సబబుకాదని అన్నారు. చనిపోయిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అన్ని మున్సిపాలిటీలో ఉద్యోగాలు ఇచ్చినా ఈ మున్సిపాలిటీలో ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని



తెలిపారు. ఈ సమస్యలు పరిష్కారం చేయాలని అనేకసార్లు విన్నవించినా ఫలితం లేకపోవడం వల్లే 26 నుండి పనులు బంద్ చేస్తున్నామని తెలిపారు. లేబర్ కోడ్ లు రద్దు చేయాలని జులై 9 న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.మోడీ తెచ్చిన లేబర్ కోడ్ లను ఈ రాష్ట్రంలో అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కూడా సిద్ధం కావడం కార్మికులకు ద్రోహం చేయడమేనని అన్నారు. కనీస వేతనాలు, ప్రభుత్వ రంగసంస్థల పరిరక్షణ, పి యఫ్, గ్రాడ్యూటి అమలు వంటి సమస్యల పరిష్కారం కోసం ఈ జులై 9 సమ్మె చేపడుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా నాయకులు మోహన్, యం రవి, కె వెంకటి, యస్ శంకర్, యస్ రమేష్, యస్ తిరుపతి, ప్రకాష్ శకుంతల, గురువారి, ఉషా, తో పాటు కార్మికులు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## శ్యాం ప్రసాద్ ముఖర్జీకి నివాళులు

**ఇచ్ఛాపురం, జూన్ 23(వార్త):** భారతీయ జన్ సంఘ్ వ్యవస్థాపకుడు హిందుత్వ వాది శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలు నిర్వహించారు.బలిదాన్ దివాస్ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి వల్లంపాటి కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక వీకేపీ ఫంక్షన్ హాల్ లో అతని చిత్ర పటానికి కి పూల మాల వేసి ఘనంగా నివాళు లు అర్పించారు. ఈ కార్యక్రమానికి పూర్వ అధ్యక్షులు సాలిన ఢిల్లీ, జిల్లా యువమోర్చ, ధనుష్ రంగా, సాడి ధర్మ, మార్కండేయ, బుజ్జి, నీలవేణి, స్థానిక ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరు అయ్యారు.



# చినుకు..వాహనదారుల వెన్నులో వణుకు



**సరుబుజ్జిలి, జూన్ 23(వార్త):** సరుబుజ్జిలిలో రోడ్లు చుస్తే దమ్ము పొలాలను తలపిస్తుంది. వర్షం పడ్డ వారం రోజులైనా గోతుల్లో బురద అరే పరిస్థితి లేదు. గతంలో ఆమదాలవలస నుండి హిరమండలం వరకు రోడ్లు మరమ్మత్తులు చేపట్టినప్పటికి సరుబుజ్జిలి హెడ్ క్వార్టర్ లో మాత్రం పట్టించుకోలేదు. ఇప్పటికే ప్రమాదకరమైన గోతులుతో చేపల చెరువును తలిపిస్తుంది. ఇప్పటికైనా ఆర్ %౮% బి అధికారుకు స్పందించి మరమ్మత్తులు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. లేని పక్షంలో వామపక్షల సహాయంతో ఉద్యమిస్తామని పలువురు స్థానికులు వారి అభిప్రాయాలను వ్యక్తపరిచారు.



# మెగా ఉద్యోగ మేళాకు విశేష స్పందన




**ఇచ్ఛాపురం, జూన్ 23(వార్త):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో జాబ్ మేళాలు నిర్వహించాలని ఇచ్చిన ఆదేశాలమేరకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా ఇచ్ఛాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఇచ్చాపురంలోని ప్రైవేటు డిగ్రీ కళాశాల ఆవరణంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ మెగా జాబ్ మేళాకి 17 ప్రైవేటు సంస్థల ప్రతినిధులు హాజరయ్యి ఇంటర్వ్యూలు నిర్వహించారు దీనిలో 832 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా అందులో 281మంది వివిధ కంపెనీలలో ఎంపిక అయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్య అతిధి గా విచ్చేసిన ప్రభుత్వ విప్, శాసన సభ్యులు బెందాళం అశోక్ మాట్లాడుతూ జాబ్ మేళా కి హాజరైన ప్రతి నిరుద్యోగ యువత ఈ ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని సూచించారు, గతంలో అభ్యర్థులు కంపెనీల చుట్టూ తిరుగుతూ ఉదోగాల కోసం నిరీక్షణ చేయాల్సి వచ్చేదని కానీ ఇప్పుడు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యం లో కంపెనీలే మనవద్దకు వచ్చి వారికి కావాల్సిన అభ్యర్థులను ఎంపిక చేసుకునే విధంగా పరిస్థితులు మెరుగుపడ్డాయని తెలిపారు.ఈ కార్యక్రమానికి జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయి కుమార్ , జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు దాసరి రాజు , తెలుగుదేశం అధ్యక్ష కార్యదర్శి లు పత్రి తవి టయ్య, నందిగం కోటి, కొండ శంకర్ రెడ్డి, నందికి జానీ, శాసన శేఖర్ ఇతర ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది, మరియు కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యువత పోరుకు భారీగా తరలిన ఇచ్ఛాపురం నేతలు

**ఇచ్ఛాపురం, జూన్ 23(వార్త):** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం కొర్లం జంక్షన్ నుండి ర్యాలీగా శ్రీకాకుళంనకు ఇచ్ఛాపురం నేతలు తరలి వెళ్లారు. కార్యక్రమంలో సీడాప్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్, జడ్పీటీసీలు తడక యశోద జోగారావు, ఇప్పిల లోలాక్షి క్రిష్ణారావు, ఉప్పాడ నారాయణమ్మ, ఎంపీపీలు పైల దేవదాస్, బోర పుష్ప, నిమ్మాన దాసు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉళాల బారతీ దివ్య, మండల పార్టీ అధ్యక్షులు కడియాల ప్రకాష్, పాతీర్ల రాజశేఖర్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ బడకల మోహన్ రావు, మాజీ పి.ఎ.సి.ఎస్ అధ్యక్షులు గుమ్మిడి రాందాస్, బార్ల నాగభూషణం పాల్గొన్నారు.



## ఘనంగా మాజీ ఎమ్మెల్యే జగన్నాయకులు జయంతి

**మందస, జూన్ 23(వార్త):** మందస మండలంలో పలు చోట్ల మాజీ ఎంఎల్ఏ స్వర్గీయ జుత్తు జగన్నాయకుల జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. బిడిమి వద్ద గల జుట్టు ఘాట్ లో జరిగిన జయంతి వేడుకల్లో జగన్నాయకుల సతీమణి ధనలక్ష్మి, సోదరుడు జుత్తు నీలకంఠంతో పాటు పెద్ద ఎత్తున అభిమానులు, పార్టీ నాయకులు, చుట్టూ ప్రక్కల గ్రామస్తులు, స్తానికులు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు. ఈ ప్రాంతానికి జుత్తు జగన్నాయకులు చేసిన సేవలు, అభివృద్ధి వివరించారు. భేతాళపురం గ్రామంలో వైఎస్సార్సీపీ సీనియర్ కార్యకర్తల సమక్షంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్నాయకుల విగ్రహాల వద్ద జుత్తు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ జగన్నాయకుల గొప్పతనం వివరించారు. కార్యక్రమంలో డా.వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ బోర్డ్ మెంబర్ బత్తిని లక్ష్మణ్, పలాస నియోజకవర్గ వైఎస్సార్ సీపీ యువజన అధ్యక్షుడు దున్న హరికృష్ణ, గ్రామ వైస్సార్సీపీ నాయకులు గుంటు లింగరాజు, జుత్తు పాపారావు, కీలు మోహన్ రావు, తాడల అప్పలస్వామి, మడియా రుషేంద్రరావు, జుత్తు నారాయణ, వార్డు మెంబర్ సంగారు కృష్ణారావు, గుంటు చంద్రయ్య, దున్న సురేష్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా హరిపురం గ్రామంలో ఆయన విగ్రహం వద్ద, నారాయణపురం గ్రామంలో జగన్నాయకులు విగ్రహం వద్ద జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం సోదరుడు జుత్తు నీలకంఠం మాట్లాడుతూ బేతాళపురం గ్రామంలో



ఇచ్ఛాపురం నియోజవర్గంలో కవిటి మండలంలోని కవిటి గ్రామంలో, ఇచ్ఛాపురం మండలంలోని కేశు పురం గ్రూప్ లో, కంచిలి మండలంలోని కుత్తుం గ్రామంలో, సోంపేట మండలంలోని జింకిబద్ర గ్రామంలో, పలాస నియోజకవర్గంలో వజ్రపుకొత్తూరు మండలంలో గల పూండి గ్రామంలో వేడుకలు జరిగాయని చెప్పారు. జుత్తు జగన్నాయకుల అభిమానులు పాల్గొన్నారు.




## 28 వరకు మీజిల్స్ రుబెల్లా టీకాలు

**శ్రీకాకుళం, జూన్ 23(వార్త):** మీజిల్స్ రూబెల్లా స్పెషల్ డ్రైవ్ జూన్ 23 నుండి జూన్ 28 వరకు జిల్లా వ్యాప్తంగా ఇమ్యూనైజేషన్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు వెల్లడించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికలో 2వ విడత మీజిల్స్ రుబెల్లా నిర్మూలనా కార్యక్రమం బ్యానర్ ను ఆవిష్కరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. అనిత మాట్లాడుతూ మీజిల్స్ రుబెల్లా స్పెషల్ డ్రైవ్లో భాగంగా జూన్ 23 నుండి జూన్ 28 వరకు జిల్లా వ్యాప్తంగా ఇమ్యునైజేషన్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలక్టర్ డి.పద్మావతి, డిఆర్డిఎ పిడి కిరణ్ కుమార్, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ వేణుగోపాల్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా? రామ్స్, ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి



**పలాస, జూన్ 23(వార్త) :** శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలను ఘనముగా సోమవారం నిర్వహించారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గల వివిధ బూత్ లలో పట్టణ అధ్యక్షులు పొట్నూరు తారకేశ్వర రావు గారి అధ్యక్షతన అన్ని బూత్ లలో ఆయన చిత్రపటానికి పూల మాల లు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలవలస వైకుంఠరావు మాట్లాడుతూ జన సంగ్ పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ సేవలు కోసం కొనియాడారు. కార్యక్రమాలలో పట్టణ ప్రధాన కార్యదర్శి హనుమంతు రామారావు, బిజెపి సీనియర్ నాయకులు కాంచరాణ బుజ్జి , కర్రి ప్రసాద్, అన్నెపు వైకుంఠరావు, బోండా శ్రీనివాస్, బమ్మిడి కుమార్, తమ్మినాన మాధవరావు, గొంటి అప్పారావు, కంచరాన పోలినాయుడు, కోమటూరి పాపారావు, బుర్జాపేట హరికృష్ణ, కోత గంగాధర్, తిరునగరి గణేష్, అన్నిబూత్ లలో మహిళలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

**పలాస, జూన్ 23(వార్త):** అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు ఆదేశించారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం కమిషనర్ ఇంజనీరింగ్ విభాగమునకు సంబంధించి సిబ్బంది అందరితో అభివృద్ధి పనుల పురోగతిని పూర్తిస్థాయిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్ బిల్లుల పరిస్థితిని ఆరా తీసి బిల్లుల చెల్లింపులో ఎటువంటి అలసత్వం వహించకుండా ఉండాలని, ఇప్పటికే పూర్తయిన అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమంల యొక్క బిల్లులను నిధి పోర్టల్ లో ఆన్లైన్ చేయాలని ఆదేశించారు. అదే రకంగా ఇంజనీర్లకు టార్గెట్లను నిర్ణయిస్తూ విధులను కేటాయించారు. ఈ సందర్భంగా కమిషనర్ వారు మాట్లాడుతూ సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమం సందర్భంగా పలాస శాసన సభ్యురాలు గౌతు శిరీషకి పురపాలక సంఘం తరపున మొదటి వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియ జేస్తూ, ఈ పురపాలక సంఘంలో ఈ సంవత్సర కాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని అదే రకంగా దశాబ్దాల కాలంగా జంట పట్టణాలకు ఉండే మంచినీటి సమస్యను ఉద్దానం ప్రాజెక్ట్ నుండి సింధుర జలసిరి కార్యక్రమం ద్వారా నీటిని తీసుకువచ్చి ప్రజలు దాహార్తిని శాశ్వత ప్రాతిపదికన తీర్చడం జరిగిందని, సమీప భవిష్యత్తులో ఈ పురపాలక సంఘం సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తానని శాసన సభ్యులు వారు తెలియజేసినట్లుగా చెప్పారు. ఈ నేపథ్యంలో ఇంజనీరింగ్ సిబ్బంది చురుకైన పాత్రను వహించి జంట పట్టణా లకు ప్రజలందరికి అభివృద్ధి ఫలాలను అందించడానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ డి ఈ కనకరాజు, అసిస్టెంట్ ఇంజనీర్ లు కిరణ్, అలేఖ్య,ఇంజనీరింగ్ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546